
మనం
కడప | అన్నమయ్య

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు



ప్రొద్దుటూరు జూన్ 13 మనం న్యూస్ : ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారధి ఆర్‌డబి అతిథి గృహం లో ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు దుశ్శలువాతో ఘనంగా సత్కరించారు. జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికిసంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.





# ఫేక్‌పార్టీ, ఫేక్ న్యూస్‌లను గొడ్డలి పార్టీ ప్రచారం చేస్తుంది

### వైసీపీ నాయకులపై ధ్వజమెత్తిన చమర్తి జగన్మోహన్ రాజు

### టిడిపి గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదు – టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు



రాజంపేట.జూన్. 13 (మనం న్యూస్ )

రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా మతిస్థిమితం కోల్పోయారని, తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడే అర్హత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తో సహా వారి పార్టీ నాయకులకు లేదని తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గం ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. శనివారం రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలనను అందించడంతో ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సంబరాలు చేసుకుంటే,వైసిపి నాయకులు వెన్నుపోటుకు రెండేళ్లు అంటూ రోడ్ల మీదకి రావడం దారుణం అన్నారు. అమరావతిని 34 వేల ఎకరాలలో నిర్మిస్తామని చెప్పిన వైసిపి ప్రభుత్వం మాట మార్చి మూడు రాజధానులంటూ డైవర్షన్ రాజకీయాలు చేసి చివరకు రాజధాని లేకుండా చేశారని, ఇప్పుడు మళ్లీ కొత్త పేరును తెరపైకి తీసుకువచ్చి కులాలు ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని పేర్కొన్నారు. పోలవరాన్ని పక్కదారి పట్టించడమే కాకుండా, రాష్ట్రంలో ఇసుక, భూ మద్యం మాఫియాలకు తెరలేపి కోట్ల రూపాయల ను దండుకుని రాష్ట్రంలో ఫ్యాక్షన్ కు తెర లేపారని విమర్శించారు. వైసిపి పాలనలో స్థానిక సంస్థల నిధులను పక్కకు మళ్ళిస్తే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులను కోట్ల రూపాయలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య డ్యాం తెగిపోవడంలో అప్పటి ఎమ్మెల్యే మల్లికార్జున రెడ్డి పాత్ర ఉందని తెలిపారు. ఇసుకను దోచుకునేందుకు నదిలో వారి టిప్పర్లు, హిటాచీలు ఉండడంతో పించా గేట్లు ఎత్తినప్పటికీ అన్నమయ్య డ్యాం గేట్లు ఎత్తనివ్వకుండా చేసి డ్యాం కొట్టుకుపోవడానికి కారణమయ్యారని, దీంతో పదుల సంఖ్యలో అమాయక ప్రజలు మృతి చెందగా, వేల సంఖ్యలో పశుపక్షాదులు కొట్టుకుపోయాయని తెలిపారు. అన్నమయ్య పునర్నిర్మానానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఈ నేపథ్యంలో మద్రాస్ ఐఐటి వారితో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి 4.76 లక్షల క్యూసెక్కుల నీటిని నిలువ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. మేడా మల్లికార్జున రెడ్డి రాజకీయ పార్టీలలో కుల సంఘాలలో చిచ్చులు పెడుతూ రాజకీయాలు చేస్తున్నారని ఆయనకు ఎంత మాత్రం తగదున్నారు. వెంటనే ఆయన ఏ పార్టీలో ఉన్నారో స్పష్టంగా తెలుసుకోవాలని చెప్పారు. ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రాజంపేట మండలంలో వేల ఎకరాల ప్రభుత్వ పేద భూములను దోచుకుంటే మేడ మల్లికార్జున్ రెడ్డి నందలూరు మండలంలో వారి కుటుంబ సభ్యుల పేరుతో ఆకేపాటికి ఏమాత్రం తగ్గకుండా భూములను ఆక్రమించుకున్నారని విమర్శించారు. వీరు ఇరువురు ఆక్రమించుకున్న భూములను వెలుగులోకి తీసుకొచ్చి పేద ప్రజలకు పంపిణీ చేసేందుకు తాము ప్రయత్నిస్తే, మీరుకోర్టుకు వెళ్లి అడ్డుపడలేదా అని ప్రశ్నించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ ఎత్తిపోతల పథకం పనులను నాసిరకంగా నిర్మించి ఆ పథకాన్ని ఎందుకు పనికి రాకుండా చేస్తే కూటమి ప్రభుత్వం 13 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసిందని చెప్పారు.రాజంపేట లో వైసీపీ అక్రమాలపై నియోజకవర్గ అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని మీరు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బనర్సయ్య నాయుడు, మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, రాజంపేట మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, మాజీ పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యులు ముద్దుకృష్ణారెడ్డి, పీ-ఫోర్ మార్గదర్శకులు ఉద్దండం సుబ్రహ్మణ్యం, మంద శీను, ఒంటిమిట్ట టిడిపి నాయకులు బొబ్బిలి రాయుడు, టీ ఎన్ ఎస్ ఎఫ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# హౌసింగ్ అక్రమాలపై ఉక్కుపాదం

### హౌసింగ్ శాఖ సమీక్ష సమావేశంలో అధికారులకు మంత్రి పార్థసారథి సీరియస్ వార్నింగ్

### సెప్టెంబర్ నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి

### స్వాహా చేసిన నిధుల రికవరీకి చర్యలు


కడప జూన్ 13(మనం న్యూస్) : గతంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు.శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు ఆర్‌డబి అతిథి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి.. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల పేదలు నష్టపోయారని.. పేదల కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. జరిగిన ప్రతి అక్రమంపై విచారణ జరిపి స్వాహా చేసిన కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు.

మెప్మా మహిళా సంఘాలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్లలో ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న సెప్టెంబర్--అక్టోబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి చేసి లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, "ప్రభుత్వం జీతాలు ఇస్తోంది ప్రజలకు సేవ చేయడానికి.. ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడానికి కాదు. ఇకపై నిర్లక్ష్యం, అలసత్వం అస్సలు సహించం. లక్ష్యాలు చేరుకోలేకపోతే ఉద్యోగాలు వదిలి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తెచ్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు.పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ లబ్ధిదారుడు తన ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుందని, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

ఈ సమావేశం లో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబందిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరుకు చేయాలని ముక్కు రూపానందరెడ్డికి విలేకరుల వినతి

పెనగలూరు(జూన్ 13),మనంన్యూస్: జర్నలిస్ట్ లకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని పెనగలూరు మండల పాత్రికేయులు రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ, కుడా చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి కి వినతి పత్రం ఇచ్చారు. శనివారం ఉదయం రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముక్కా రూపానంద రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెనగలూరు మండలం విలేఖర్లు తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. ఈ సంధర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్ళి జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో నేతగాని నాగయ్య, దాసరి సుధాకర్, కుంచం జయరామయ్య, ఈది.శివ కుమార్, ముద్దల మధు, ఆకుల హరి కృష్ణ, సోమేసుల శివ పాల్గొన్నారు.

## లోపాలు లేని ఓటరు జాబితాకు సహకరించాలి

### తహశీల్దార్ ఏకె ప్రేమ్ కుమార్

పెనగలూరు(జూన్ 13),మనంన్యూస్: లోపాలు లేని ఓటరు జాబితాను తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహశీల్దార్ ఏకె ప్రేమ్ కుమార్, ఆర్ ఐ రామ్మోహన్ తెలిపారు. శనివారం పెనగలూరు మండల పరిధిలోని బిఎల్‌ఏ లతో సమావేశం నిర్వహించారు. ఓటరు కార్డ్ లో అసంపూర్తి సమాచారం ఉంటే పూర్తి ఓటరు సమాచారం ఉండే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బిఎల్ఓ లు ద్వారా జరిగే ఈ



కార్యక్రమానికి బూత్ లెవల్ ఏజెంట్లు సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# రైల్వే సౌత్ కోస్ట్ జిఎం సందీప్ మత్తూర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి




రైల్వే కోడూరు, జూన్ 12, మనం న్యూస్
కడప జిల్లా రాజంపేట రైల్వే స్టేషన్ కు శనివారం నాడు రైల్వే సౌత్ కోస్ట్ జనరల్ మేనేజర్ సందీప్ మత్తూర్ విచ్చేసి అమృత్ భారత్ స్కీమ్ పరిధిలో జరుగుతున్న పనులను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్ రైల్వే డిఆర్ యుసిసి సభ్యులు, వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి సందీప్ మత్తూర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం తల్లెం భరత్ కుమార్ రెడ్డి పలు సమస్యలను ఆయన దృష్టికి వినతి పత్రం రూపంలో తీసుకువెళ్లి వివరించారు. అనంతరం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి రైల్వే స్టేషన్లో కొన్నిచోట్ల బ్రిడ్జిలను సరిగ్గా నిర్మించకపోవడం మరియు వాటి యొక్క నిర్మాణ పురోగతి పనుల గురించి పూర్తి వివరాలతో తెలియజేయడం జరిగింది. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట రైల్వే కోడూరు ఎర్రగుంట్ల మధ్య బెంగళూరు కు పోవడానికి మరియు కోడూరు రాజంపేట కడప ఎర్రగుంట్ల మరియు తాడిపత్రి అనంతపురం గుత్తి గుంతకల్ ధర్మవరం మీదుగా బెంగళూరుకు పోవుటకు రైలు రాకపోకలను ఏర్పాటు చేయాలని, పుల్లంపేట శెట్టిగుంట రైల్వే స్టేషన్ కు నంద్యాల – రేణిగుంట డెమో ట్రైన్ స్టాపింగ్ ఇవ్వవలసిందిగా తెలియజేస్తూ, నందలూరు అండర్ బ్రిడ్జి నెంబర్ 111 సరైనటువంటి నిర్మాణం జరగలేదని,భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రద్దీని దృష్టిలో పెట్టుకొని నేషనల్ హైవే 716కు అనుసంధానం గా ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి తద్వారా ప్రఖ్యాత గడించిన శ్రీ సౌమ్యనాథ స్వామి గుడికి వెళ్లడానికి వీలుగా

## పలు రైల్వే సమస్యలను జిఎం దృష్టికి తీసుకువెళ్లిన తల్లెం

ఉంటుందని , అంతేకాకుండా ట్రాఫిక్ నియంత్రణకు అడ్డుకట్ట వేయచ్చని తెలిపారు. ముఖ్యంగా వందే భారత్ రైలు రేణిగుంట వరకు మాత్రమే పరిమితమైన తరుణంలో రేణిగుంట రైల్వే కోడూరు రాజంపేట కడప మీదుగా హైదరాబాద్ వరకు మరియు విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లకు ఇదే మార్గంలో వందే భారత్ రైళ్లను పొడిగించే విధంగా చర్యలు చేపట్టాలని, నందలూరు రైల్వే స్టేషన్‌కి వాటరింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని, గూడూరు విజయవాడ ప్యాసింజర్ రైలును రేణిగుంట మీద కడప వరకు పొడిగించవలసిందిగా కోరారు. నిర్మించినటువంటి రైల్వే అండర్ బ్రిడ్జిలకు సన్ రూఫ్ లను ఏర్పాటు చేసి ప్రయాణికుల యొక్క రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చేయాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా పీలేరు రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న 759 బ్రిడ్జిలో ఎంపీ నిధులతో బ్రిడ్జి రోడ్డు వేసుకునే దానికి అనుమతులు మంజూరు చేయాలని తెలియజేస్తూ కోలాపూర్ ట్రైన్ స్టాపింగ్ పలు రైల్వే స్టేషన్లో లేదని వాటిని కూడా పునరుద్ధరించాలని తెలుపుతూ రేణిగుంట నంద్యాలకు ఉదయం సమయంలో ఒక డెమో ట్రైన్ ను ప్రయాణికుల ప్రయాణ సౌకర్యార్థం ఏర్పాటు చేసి ప్రజలకు రైలు ద్వారా రాకపోకలను చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన వినతిపత్ర రూపంలో తెలియపరచడం జరిగింది. ఇవన్నీ ఎంతో ఓపిగ్గా, సహృదయంతో విన్న జిఎం సందీప్ మత్తూర్ వీటన్నిటిపై దృష్టి సారిస్తామని ఒక ప్రణాళిక తయారు చేసి వీలైనంత మేరకు అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు భరత్ కుమార్ రెడ్డి తెలియజేశారు..

# ఆయుర్వేద వైద్యముతో సకల రోగాలు దూరం : ట్రస్ట్ అధినేత అబ్దుల్ సుబహాన్


ఒంటిమిట్ట జూన్ 13 (మనం న్యూస్) ఆయుర్వేద వైద్యముతో సకల రోగాలు దూరం అవుతాయని నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ అన్నారు.ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లి గ్రామ శివారులో ఉన్న మదరసా నందు శనివారం పేదలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ట్రస్ట్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు, వసతులను కల్పించడం జరుగుతోందని తెలిపారు ఉమ్మడి కడప జిల్లాలోని పలు మండలాలలో ఉన్న పేద ప్రజలకు శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పెన్షన్ రూపంలో నగదును అందజేస్తూ వారికి ఒక తోడుగా నిలిచారు. కరోనా సమయంలో గ్రామాల వద్దకు వెళ్లి కూరగాయలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేసి వారికి చేదోడుగా



నిలిచారు. ఇమాములను, మౌజాములను ఆదుకుంటూ వారికి అండగా నిలిచారు. ఆయుర్వేద పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రజలకు మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయడమే తన అభిమతం అని, ప్రతి ఒక్క వ్యక్తి తన వద్ద ఉన్న సంపదలో కొద్ది వరకు పేదలకు సహాయం చేయడానికి వినియోగించాలని వారు కోరారు. పేదలకు సేవ చేయడంలో పరమార్థం ఉందని, అలాంటి వారు మోక్ష ప్రాప్తి పొందుతారని అన్నారు. ఆయుర్వేద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడానికి ప్రజల సహాయ సహకారాలు అవసరమని, తమవంతుగా దాతలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. గత దశాబ్దాల కాలం నుండి పేదలకు సేవ చేయడంతోనూ, ఆయుర్వేద పరంగా ప్రజలకు సేవలు అందించడంలోనూ అనేక సంస్థలు గుర్తించి అనేక ప్రశంసా పత్రాలను కూడా అందించాయి. తమ ప్రాణం ఉన్నంతవరకు పేద ప్రజలకు కుల మతాలకు అతీతంగా సేవ చేస్తానని ఆయన అన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి: తాసిల్దార్

చిట్వేలి జూన్ 13 మనం న్యూస్ ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) – 2026 కార్యక్రమంలో భాగంగా విజయవంతంగా అమలు చేసేందుకు మండల కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్లు,(బి.ఎల్.ఓ.ఎస్) మరియు బూత్ లెవల్ ఏజెంట్లు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మండల తహసీల్దార్ ఎస్.వి. నరసింహారావు అధ్యక్షత వహించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 కార్యక్రమం యొక్క లక్ష్యాలు, విధి విధానాలు, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.వి. నరసింహారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు




ఓటరు జాబితాలో నమోదు కావడం, మరణించిన వారి పేర్లు మరియు ద్వంద్వ నమోదులను తొలగించడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలను నిబంధనల మేరకు ఖచ్చితంగా చేపట్టాలని బి.ఎల్.ఓ లకు సూచించారు. అలాగే ఓటరు జాబితాల స్వచ్ఛత మరియు పారదర్శకతను కాపాడేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బి.ఎల్.ఏఎస్ కూడా ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఓటరు నమోదు తొలగింపు, మార్పులు, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను కచ్చితంగా పాటించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని బి.ఎల్.ఓలు, వివిధ రాజకీయ పార్టీల బి.ఎల్.ఏ.ఎస్.లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీ మాటలు ప్రజలు నమ్మరు: కొమరా వెంకట నరసయ్య..

ఒంటిమిట్ట జూన్ 13(మనం న్యూస్) : జగన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి అనేది అసలు కనిపించకుండా పోయింది. రెండేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన6 హామీలను నెరవేర్చింది. 23 లక్షల నూతన పెట్టుబడులను తీసుకొచ్చి తద్వారా ఇరవై ఒక్క లక్షల నూతన ఉద్యోగ అవకాశాలను ఈ ప్రభుత్వం కల్పించింది. ఓర్వలేని గొడ్డలి పార్టీ అధినేత ఆ పార్టీ నాయకులు సిగ్గుయుగ్గులేకుండా టిడిపి రెండేళ్ల పాలనలో ప్రజలకు వంచన చేసిందంటూ రోడ్లెక్కడం హాస్యాస్పదమని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య మరియు ఒంటిమిట్ట మండల టిడిపి నాయకులు ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టును 72 శాతం పని పూర్తి చేయక, జగన్ రెడ్డి ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో కనీసం ఒక్క శాతం కూడా పని పూర్తి చేయలేదని వారు విమర్శించారు. అమరావతి అడ్డుకునేందుకు జగన్ రెడ్డి ప్రభుత్వం చేసిన విశ్వ ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆ పార్టీ నేతలు ప్రస్తుతం తిరిగి సర్వేకంతో సాగుతున్న రాజధాని అమరావతి పనులను అడ్డుకునేందుకు నీతిబాహ్యమైన చర్యలకు పాల్పడుతున్నారని వారు అన్నారు. టిడిపి



ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు, ఈరోజు 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం అమలు జరిగింది. కోటి రెండు లక్షల మంది మహిళలు దివ్యాంగులు ఇప్పటివరకు ఉచితంగా ప్రయాణం చేయడం జరిగింది. 46 లక్షల మంది అన్నదాతలకు 8 వేల కోట్ల 985 కోట్లలో ఆర్థిక సహాయంగా అందించిన ఘనత టిడిపిది. చెప్పుకునేందుకు ఏ పథకము వారి హయాంలో చేపట్టకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేసిన ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదు అన్నారు. ఇకపోతే కడప జిల్లాకు సంబంధించి కడప రాజంపేట పార్లమెంటు సభ్యులు అలాగే రాజ్యసభ సభ్యుడు మేడ రఘునాథ్ రెడ్డి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదని పార్లమెంటుతో మాట్లాడితే వారికి బుద్ధి వచ్చే విధంగా తగిన సమాధానం పార్లమెంటు నుంచి లభిస్తుందని కొమరా వెంకట నరసయ్య అన్నారు. రెండేళ్ల టిడిపి హయాంలో ప్రజలు వంచనకు గురయ్యారని వైఎస్ఆర్ పార్టీ నాయకులు రోడ్లెక్కి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు వినడం ఎప్పుడో మానుకున్నారు. అమరావతి రాజధాని ప్రపంచ రాజధానుల్లో ఒక ప్రముఖ రాజధానిగా పేరు తెచ్చుకో పోతుందన్న కసితో గొడ్డలి పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు తీవ్రస్థాయిలో చేస్తున్నారని వారన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో పోలవరాన్ని అమరావతిని, పూర్తి చేసి గొడ్డలి పార్టీ రాష్ట్రంలో కనిపించకుండా పోయేలా చేయడం ఖాయమని చెప్పి వారు అన్నారు. విలేకర్ల సమావేశంలో సీనియర్ నాయకులు మామిళ్ళ ఈశ్వరయ్య, పామూరు సుబ్రహ్మణ్యం,ఆర్ ఎం పి డాక్టర్ శివకుమార్, కొత్తపల్లి మురళీమోహన్,బి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మానవత కోడూరు శాఖ నూతన చైర్మన్‌గా కె.ప్రసాద్‌వర్మ ప్రమాణస్వీకారం

రైల్వేకోడూరు, జూన్ 13, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని మామిడికాయల మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణమండపంలో శనివారం మానవతా గోదూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడినది. ఈ ప్రమాణ స్వీకారంలో చైర్మన్ గా కె. ప్రసాద్ వర్మ ప్రమాణస్వీకారం చేయగా ఆయనతోపాటు నూతన కార్యవర్గం కూడా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మానవతా శాఖ కన్వీనర్ ఏ. రామాంజనేయులు రెడ్డి, మాజీ కడప జిల్లా మానవతా అధ్యక్షులు సి. సుబ్బారెడ్డి,రీజినల్ కమిటీ కన్వీనర్ జీ. రెడ్డన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
కోడూరు మానవతా శాఖ చైర్మన్ కె. ప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో, పూర్వ అధ్యక్షులు ఎం. చంద్రమోహన్ రాజు నిర్వహణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

2026--2027 నూతన కార్యవర్గం
కె. ప్రసాద్ వర్మ – చైర్మన్
టి. వెంకటరమణ యాదవ్ – కో–చైర్మన్
ఏ. శ్రీనివాసులు – కన్వీనర్
ఆర్. చంగల్ రెడ్డి – అధ్యక్షులు
ఏ. శుభాష్ బాబు – ఉపాధ్యక్షులు
బి. నాగరాజు – కార్యదర్శి
బి. జోసెఫ్ – జాయింట్ కార్యదర్శి
ఎస్. మస్తాన్ సాహెబ్ – ఈసీ (విద్య)
కె. బాలకృష్ణంరాజు – ఈసీ (వైద్యం)
ఎస్. మాధవరాజు – ఈసీ (ఎమర్జెన్సీ సేవలు)
పి. ఉదయ్ శంకర్ రెడ్డి – ఈసీ (అవగాహన కార్యక్రమాలు)
ఎస్. శివరాజు – శాంతి కమిటీ అధ్యక్షులు
ఎం. చంద్రమోహన్ రాజు – ఆత్మీయ సహకార అధ్యక్షులు

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేసి, తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తూ కోడూరు మానవతా శాఖను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని, మానవతా సంస్థ సిద్ధాంతాలు మరియు సేవలను కోడూరు మండలంలోని పేద మరియు అర్హులైన ప్రజలకు చేరవేస్తామని, అలాగే అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేపట్టి సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ నూతన కార్యవర్గం 2026–2027 సంవత్సర కాలంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి మానవతా సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించింది.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

– ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి



పెనగలూరు(జూన్ 13),మనం న్యూస్:వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పెనగలూరు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం బెస్తపల్లి కూడలిలో పలు వాహనాల డ్రైవర్లు, ప్రజలకు ఆయన రోడ్డు భద్రత నియమాలు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహన చోదకులు కొన్ని సార్లు రెప్పపాటులో చేసే పొరపాటు వల్ల జరిగే ప్రమాదాల వలన వారి కుటుంబాలు, వాహనంలో ప్రయాణించే కుటుంబాలు చిన్నా బిన్నమై పోతాయాని పలు రకాల ఉదాహరణలతో వివరించి చెప్పారు. అనంతరం ఓబిలి గ్రామంలో గంజాయి, రోడ్డు సేఫ్టీ, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా మేడా కుటుంబం

సిద్ధవటం, జూన్ 13(మనం న్యూస్) రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సిద్ధవటం మండల వైసీపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భాకరాపేట సర్కిల్ లో ఆయన సోదరుడు, ఎంఆర్‌కేఆర్ కన్స్ట్రక్షన్స్ ఎండీ మేడా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాధవరం–1 గ్రామ పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బత్తల మోహన్‌కృష్ణ, మామిళ్ల బాలకుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న కొత్తమాధవరం గ్రామానికి చెందిన గుంటి ప్రసాద్ కుమారుడు జై కైలాష్ (10సం) వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీరెడ్డి, మండల అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ దేరంగుల శివయ్య, మాజీ సర్పంచ్ కేవీ సుబ్బయ్య, వావిళ్ల శ్రీనివాసులురెడ్డి, మాధవరం–2 వైసీపి గ్రామ అధ్యక్షుడు శ్రీరాందాసు వెంకట్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జగన్నన్న లేఅవుట్‌లలో జరిగిన అక్రమాలపై త్వరలో పూర్తిగా విచరణ జరిపిస్తాం



ప్రొద్దుటూరు జూన్ 13 మనం న్యూస్: వైసిపి హయాంలో జగనన్న గృహ పథకాన్ని వైసిపి ప్రభుత్వం దోపిడీ చేయడానికి ఏర్పాటు చేసుకుందని.. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్లలో కోట్ల రూపాయలు వైసిపి నేతలు దోచుకున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరు పర్యటనలో భాగంగా నేడు మంత్రి ప్రొద్దుటూరులోని జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. డబ్బు కట్టించుకున్న కాంట్రాక్టర్ తమకు ఇల్లు నిర్మించి ఇవ్వలేదని మంత్రికి ఫిర్యాదు చేయడంతో వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సంబంధిత కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. జగనన్న లేఔట్లలో ఇంటి నిర్మాణాల కోసం ప్రజల వద్ద నుంచి డబ్బు తీసుకొని ఇంటి నిర్మాణాలను పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్లపై ఇంత వరకు ఎందుకు కేసులు పెట్టలేదని గృహ నిర్మాణ శాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణం కొరకు నేరుగా ప్రజల వద్ద నుంచి 35 వేల రూపాయలు అప్పటి మునిసిపల్ కమిషనర్ కాంట్రాక్టర్లకి ఇప్పించారని దీనిపై కూడా విచారణ చేపట్టామని మంత్రి తెలిపారు. జగన్నన్న లేఅవుట్ లలో జరిగిన అక్రమాలపై త్వరలో పూర్తి గా విచరణ చేసి బాధ్యులు ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద ప్రజలను మోసం చేసి వారి దగ్గర అక్రమంగా వసూలు చేసిన అధికారులపై వారి ఏరియా పరిధిలో ఉన్నటువంటి సచివాలయంలో తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కొండారెడ్డి, ముక్తియార్, బచ్చల పుల్లయ్య, ఇవి సుధాకరరెడ్డి, బద్వేల్ శ్రీనివాసులు రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు..

# మన కాళ్ల కింద మరో ప్రపంచం..

## తొలిసారిగా మ్యాప్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు!

**భూమి లోపల 110 క్వాడ్రిలియన్ కిలోమీటర్ల పొడవైన శిలీంధ్రాల నెట్‌వర్క్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు**

**మొక్కల మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు ఈ నెట్‌వర్క్ అత్యంత కీలకం**

**వాతావరణంలోని కర్బనాన్ని భూమిలో నిల్వ చేయడంలో దీనిది ప్రధాన పాత్ర**

**ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల ఈ భూగర్భ నెట్‌వర్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోందని హెచ్చరిక**

భూ ఉపరితలం కింద కంటికి కనిపించని ఒక అద్భుత ప్రపంచం ఉందని, మన గ్రహం మనుగడకు ఇది అత్యంత కీలకమని శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగర్భంలో విస్తరించి ఉన్న ఈ సూక్ష్మ శిలీంధ్రాల వ్యవస్థ (ఫంగల్ నెట్‌వర్క్) మొత్తం పొడవు సుమారు 110 క్వాడ్రిలియన్ కిలోమీటర్లు ఉంటుందని అంచనా. అంటే, ఇది భూమికి సూర్యుడికి మధ్య ఉన్న దూరానికి దాదాపు వంద కోట్ల రెట్లు అధికం. ఈ ఆవిష్కరణకు సంబంధించిన సమగ్ర మ్యాప్‌ను శాస్త్రవేత్తలు తొలిసారిగా విడుదల చేశారు. 'ఆర్బస్కులర్ మైకోరైజల్' (ఏఎం)గా పిలిచే ఈ శిలీంధ్రాలు భూమిపై ఉన్న సుమారు 70 శాతం మొక్కలతో సహజీవన సంబంధాన్ని కొనసాగిస్తాయి. కిరణజన్య సంయోగక్రియ ద్వారా మొక్కలు తయారు చేసుకున్న చక్కెరలను ఇవి స్వీకరిస్తూ అందుకు ప్రతిఫలంగా తమ దారాల వంటి నిర్మాణాలను వేర్ల కంటే సుదూరంగా విస్తరించి, మొక్కలకు అవసరమైన నీరు,



ఫాస్ఫరస్, నైట్రోజన్ వంటి పోషకాలను అందిస్తాయి. దీనిని శాస్త్రీయంగా 'వుడ్ వైడ్ వెబ్' అని కూడా వ్యవహరిస్తారు. 'సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్స్' (ఎల్పీయూఎన్) నేతృత్వంలోని పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా 16,000కు పైగా మట్టి నమూనాలను విశ్లేషించి ఈ మ్యాప్‌ను రూపొందించారు. ఈ అధ్యయనం వివరాలు ప్రతిష్ఠాత్మక 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ భూగర్భ నెట్‌వర్క్ సుమారు 300 మెగాటన్నుల కార్బన్‌ను నిల్వ చేసుకుందని, ఇది భూమిపై ఉన్న మొత్తం మానవ జాతి బరువు కంటే నాలుగు నుంచి ఆరు రెట్లు ఎక్కువని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రసాయన ఎరువుల అతి వినియోగం, భూమిని విపరీతంగా దున్నడం వంటి కారణాల వల్ల ఈ సహజ నెట్‌వర్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన ప్రాంతాలతో పోలిస్తే వ్యవసాయ భూముల్లో ఈ శిలీంధ్రాల సాంద్రత 50 శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఈ భూగర్భ నెట్‌వర్క్‌ను పరిరక్షించడం ద్వారా ఆహార భద్రత, జీవవైవిధ్యం, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి కీలక లక్ష్యాలను సాధించవచ్చని వారు సూచిస్తున్నారు.

# 80 సర్వే నెంబర్లలోని పబ్లిక్ పర్పస్ స్థలాలు, రోడ్ల ఆక్రమణలను తొలగించాలి



బద్వేల్, మనం న్యూస్: బద్వేల్ పట్టణ కేంద్రంలోని సుమారు 80 పైగా సర్వే నెంబర్లలోని పబ్లిక్ పర్పస్ స్థలాలు, రోడ్లు, కల్వర్టులు మాయమయ్యాయని, వాటిని కొంతమంది పెద్ద మనుషులు ముసుగులో ఆక్రమించి లక్షలాది రూపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని, వాటన్నింటి పైన జిల్లా ఉన్నతస్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆక్రమణలను తొలగించి బద్వేల్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి కడప జిల్లాడీసీసీబి బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి గారికి శనివారం ఉదయం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ బృందం ఆయన ఆఫీసు నందు కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది.దీనికి స్పందించిన మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆక్రమణదారులు ఎవరైనా ఏ పార్టీకి చెందిన వారైనా క్షమించేది లేదని తప్పకుండా వీటన్నింటిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణ తొలగించేం దుకు ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీసభ్యులు ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గత రెండు మూడు సంవత్సరాలుగా కొంతమంది అధికార పార్టీ ప్రతినిధుల ముసుగులో ఉన్న నాయకులు ఒక కోటరీగా ఏర్పడి మడకలవారిపల్లె గ్రామ పొలంలోని 811, 808, 1013, 953, 163,164,812 లతోపాటు మరి కొన్ని సర్వే నెంబర్లలోని ప్రభుత్వ పబ్లిక్ పర్పస్ స్థలాలను మరియు పెద్ద రోడ్లను చిన్న రోడ్లుగా కుదించి కొన్ని రోడ్లు పూర్తిగా ఆక్రమించి పెద్దపెద్ద భవనాలు నిర్మించి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అలాగే గోపవరం రెవిన్యూ పొలం 168, 1635 1636,1624 మరియు సెంచరీ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న 1557 సర్వే నెంబర్లలో పెద్ద ఎత్తున ఆక్రమాలు జరిగాయని అలాగే బద్వేల్ మండలం సి కొత్తపల్లె పొలం 53,54 లతోపాటు యువనేత ముఖ్య అనుచరుడు మరి కొంతమంది కలిసి సిద్ధవటం రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని చెన్నంపల్లి గ్రామ పొలం 1580ఖ నందు రెవెన్యూ అధికారుల సహకారంతో ఎకరా స్థలం పైబడి ఆక్రమించి కంచె వేశారని అలాగే 1616 సర్వే నెంబర్ లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఎవరైనా ప్రజాస్వామ్యవాదులు వామపక్ష పార్టీల నాయకులు ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారులపైనే కేసులు నమోదు చేసే ఆనవాయితీని బద్వేల్ రెవిన్యూ అధికారులు పాటిస్తూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. గోపవరం రెవిన్యూ పొలంలోని 1848,1852లోని విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ సెలవు దినాలను అవకాశంగా తీసుకొని పట్టపగలే చదును చేస్తున్నారని వీటితోపాటు నాగుల చెరువు, భాకరాపేట, బయనపల్లె, చింతలచెరువు,ఈ విషయాలన్నిటి పైన ఇప్పటికే తహసీల్దార్ నుండి జాయింట్ కలెక్టర్ వరకు ఆధారాలతో కూడిన వినతి పత్రాలను ఇవ్వడం జరిగిందని మీరు కూడా జిల్లాస్థాయి అధికారులతో చర్చించి త్వరితగతిన ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకునే విధంగా కృషి చేసి బద్వేల్ పట్టణ ప్రజలను కాపాడాలని ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డికి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు, కే బాబు, నారాయణ, జయరామరాజు, రామరాజు, గంటా మహబూబ్బాషా పట్టణ కమిటీ సభ్యులు చెన్నయ్య, సలీం, నరసింహ పాల్గొన్నారు.




# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన సిఐ వెంకటేశ్వర్లు

సిద్ధవటం, జూన్ 13 (మనం న్యూస్): రౌడీ షీటర్లు ప్రజలను భయభ్రాంతులు చేస్తే తోక కట్ చేస్తానని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం మాట్లాడుతూ కడప జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం ఒంటిమిట్ట , సిద్ధవటం, నందలూరు మండలాల్లో రౌడీ షీటర్లు ఒకరి భూమి లాక్కొని దౌర్జన్యాలు చేసి ప్రజలను భయభ్రాంతులను చేస్తే తోక కట్ చేస్తానని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు రౌడీ షీటర్లు ఎక్కడైనా రౌడీయిజం గూండా గిరి గలాటాలు సృష్టించి ప్రశాంతంగా ఉన్న పల్లె ప్రాంతాలలో రగడ చేస్తే సమాచారం తెలపాలని తెలిపారు రాబోయే స్థానిక ఎలక్షన్లో రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో ఉండాలని రౌడీ షీటర్లకు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల ఎస్సై హారిక స్థానిక పోలీసులు పాల్గొన్నారు

# అర్హులు మాత్రమే ఓటర్ జాబితాలో ఉండాలి

సబ్ కలెక్టర్ భావన



సిద్ధవటం జూన్ 13(మనం న్యూస్) :అర్హులు మాత్రమే ఓటర్ లిస్టులో ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు మండలంలోని మాధవరం, 1 పార్వతిపురంలో గ్రామంలో శనివారం మాట్లాడుతూ జూన్ 15 నుండి జూలై 14 వరకు సర్ ప్రోగ్రాం లో భాగంగా అర్హులైన స్థానికులకు మాత్రమే ఓటర్ లిస్టులో గుర్తించాలని వలసలు వెళ్లినవారు ఇతర గ్రామాల చెందిన వారిని తొలగించాలని ఆదేశించారు సిద్ధవటం మండలంలో, 99% ఓటర్ లిస్టు పూర్తిచేయాలని తెలిపారు మండల తాసిల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి ఓటర్లు గుర్తించి మ్యాపింగ్ చేస్తామని అర్హులైన వారికి మాత్రమే ఓటర్ లిస్టులో నమోదు ప్రక్రియ ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో డీఎల్ఏలు, బి ఎల్ వోలు పాల్గొన్నారు

# వైసీపీ సీనియర్ నాయకులు మోసాటి పిచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



చిట్వేలి జూన్ 13 మనం న్యూస్ ప్రతినిధి: మండల పరిధిలోని కె.ఎస్ అగ్రహారం నందు గత కొద్ది రోజుల క్రితం మృతి చెందిన వైస్సార్సీపీ సినియర్ నాయకులు మోసాటి పిచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను శనివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించిన వైసిపి మాజీ ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు బసిరెడ్డి రమణ రెడ్డి, మోసాటి రాముడు, మోసాటి చెంగల్ రాయుడు, మోసాటి సురేష్, స్థానిక గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కొరుముట్ల

చిట్వేలీ జూన్ 13 మనం న్యూస్ ప్రతినిధి: మండల కేంద్రంలోని మైలిపల్లి పంచాయతి ఎం.గొల్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, మాజీ సర్పంచ్ కోమ్మిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇటీవలే గుండెకు శస్త్రచికిత్స చేసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుసుకుని శనివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు బసిరెడ్డి రమణ రెడ్డి, మల్లికార్జున రెడ్డి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

